90 శాతం రాయితీని వినియోగం చేసుకోండి

ఎల్బీనగర్, మార్చి 1: జీహెచ్‌ఎంసీ వ్యాప్తంగా ఆస్తిపన్ను ఆపరాద రుసుంలో 90 శాతం రాయితీ కల్పిస్తున్నామని, ప్రజలంతా సద్వినియోగం చేసుకుని ఆస్తిపన్ను చెల్లించాలని ఎల్బీనగర్ జోన్‌లోని సర్కిళ్ల ఉప కమిషనర్లు ఒక ప్రకటనలో కోరారు. ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం వసూళ్లపై దృష్టి సారించామని హయత్‌నగర్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య, సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

మలక్‌పేట, మార్చి 1: పాత మలక్‌పేట డివిజన్‌లోని శంకర్‌నగర్‌లో డ్రైనేజీ, తాగునీటి లైన్ల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు షఫీ వాటర్ వర్క్స్ అధికారులను కోరారు. శుక్రవారం శంకర్‌నగర్‌లో వాటర్ వర్క్స్ మేనేజర్ హష్మత్ అలీ, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డివిజన్ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించారు.

లక్ష్యం వంద శాతం

ఎల్బీనగర్ జోన్ ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ.320.94కోట్లు

■ జనవరి వరకు రూ.187.21కోట్ల వసూళ్లు ■ బకాయిలు రూ.133.73 కోట్లు

ఎల్బీనగర్, మార్చి 1: జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోన్‌లో ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ. 320.94 కోట్లుగా నిర్ణయించారు. ఆస్తిపన్ను వసూళ్ల కోసం ప్రతియేటా ప్రత్యేకంగా మార్చి మాసం ముందు వసూళ్లకు శ్రీకారం చుడతారు. ఈ క్రమంలో ఎల్బీనగర్ జోన్ వ్యాప్తంగా ఐదు సర్కిళ్లకు కలిపి పన్ను వసూళ్ల టార్గెట్‌ను రూ.320.94కోట్లుగా నిర్ణయించారు. మార్చి మాసాంతం వరకు ఈ టార్గెట్‌ను ఛేదించాలన్న లక్ష్యంతో నెలల వారీగా టార్గెట్లు పెట్టుకుని మరీ జీహెచ్‌ఎంసీ రెవెన్యూ అధికారులు వసూళ్ల బాటలో పడ్డారు.

సర్కిల్	టార్గెట్ (కోట్లలో)	జనవరి వరకు వసూళ్లు (కోట్లలో)
కాప్రా	రూ.65.63	రూ.42.57
ఉప్పల్	రూ.43.10	రూ.23.30
హయత్‌నగర్	రూ.74.01	రూ.43.40
ఎల్బీనగర్	రూ.62.56	రూ.36.38
సరూర్‌నగర్	రూ.75.63	రూ.41.56
మొత్తం	రూ.320.94	రూ.187.21

ఇక మిగిలిన రూ.133.73కోట్ల బకాయిలను ఫిబ్రవరి, మార్చి మాసాల్లో వసూళ్లు చేయాలని లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా మార్చి వరకు ఐదు సర్కిళ్లు కలిపి ఎల్బీనగర్ జోన్ ఆస్తిపన్ను వసూళ్లు టార్గెట్‌ను రూ.133.73 కోట్లు వసూళ్లు చేసి వంద శాతం పన్ను వసూళ్లు చేసిన జోన్‌గా నిలవాలని అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి మాసంలో కాప్రా సర్కిల్‌లో రూ.11.55 కోట్లు, ఉప్పల్ సర్కిల్‌లో రూ.9.88 కోట్లు, హయత్‌నగర్ సర్కిల్‌లో రూ.15.08 కోట్లు, ఎల్బీనగర్ సర్కిల్‌లో రూ.12.72 కోట్లు, సరూర్‌నగర్ సర్కిల్‌లో రూ.16.84 కోట్లు వసూళ్లు చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఈ మేరకు ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జోనల్ కమిషనర్ (ఎఫ్‌ఏసీ) ముకుందరెడ్డి అధికారులకు సూచించారు.

ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం

'ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం'

ఆస్తిపన్ను సమస్యల పరిష్కారానికి రేపటి నుంచి ప్రతి ఆదివారం కార్యక్రమం

ఎల్బీనగర్, మార్చి 1: ఆస్తిపన్ను సమస్యల పరిష్కారానికి మార్చి 3 నుంచి మార్చి 31 వరకు ప్రతి ఆదివారం ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం కార్యక్రమం అన్ని సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించనున్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రాపర్టీ టాక్స్ పరిష్కార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

ఆస్తి పన్ను సమస్యలు ఉన్న వారు తొలిగా మార్చి 3వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్న ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం కార్యక్రమం నిర్వహిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆస్తిపన్నుల కోర్టు కేసులు, ఫిర్యాదులు, సమస్యలు ఉన్న వారు ఆయా సర్కిళ్ల కార్యాలయాల్లో నిర్వహించే ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం కార్యక్రమంలో ఆయా సర్కిళ్ల ఉప కమిషనర్ కార్యాలయాల్లో పాల్గొని సమస్యలు పరిష్కారం చేసుకోవాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ (ఎఫ్‌ఏసీ) ముకుందరెడ్డి సూచించారు. ఎల్బీనగర్ జోన్‌లోని కాప్రా, ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల కార్యాలయాల్లో ఈ ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం కార్యాక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

దక్షిణ షిర్డీగా బాసిల్లుతున్న దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయానికి రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య ఆహ్వానించారు. శుక్రవారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. సీఎంను కలిసిన వారిలో నాయకులు రఘువీర్‌రెడ్డి, రోహిన్‌రెడ్డి ఉన్నారు. – ఎల్బీనగర్, మార్చి1

సైదాబాద్‌కు మినీ ఎయిర్‌టెక్‌ను కేటాయించాలి

సైదాబాద్, మార్చి 1 : సైదాబాద్ డివిజన్‌లో మురుగునీటి సమస్య పరిష్కారానికి ఎయిర్ టెక్ వాహనం కేటాయించాలని కోరుతూ శుక్రవారం జల మండలి జీఎం ఖదీర్ మోహినుద్దీన్‌కు కార్పొరేటర్ కొత్తకాపు అరుణ వినతి పత్రం అందజేశారు. జల మండలి కార్యాయలంలో జీఎంను కలిసి డివిజన్ పరిధిలోని శంకేశ్వరబజార్ వద్ద డ్రైనేజీ పైపులైన్, ఏకలవ్యనగర్, మూడు గుళ్లు, మాదవనగర్ కాలనీల్లో తాగునీటి పైపులైన్లను మంజూరు చేయాలని కోరారు. సైదాబాద్‌కు మినీ ఎయిర్ టెక్ వాహనం కేటాయించటం ద్వారా మురుగునీటి ఇబ్బందులను సకాలంలో పరిష్కరించడానికి ఎంతోగానో దోహద పడుతుందని తెలిపారు. బీజేవైఎం మలక్‌పేట కన్వీనర్ గంగిశెట్టి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జలమండలి జీఎంకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ

నూతన నియామకం

కందుకూరు, మార్చి 1 : సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా జర్పుల రవి నాయక్ ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కుర్ర రమేశ్ నాయక్, గౌరవ అధ్యక్షుడిగా బాలు నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రామావత్ రవి నాయక్, ప్రచార కార్యదర్శిగా గోవర్ధన్ నాయక్, కోశాధికారిగా శంకర్ నాయక్, కార్యదర్శులుగా వినోద్ నాయక్, సామ్యనాయక్, రాంచంద్రనాయక్, జగన్ నాయక్, శ్రీనునాయక్, రైతు సేన అధ్యక్షుడిగా హట్య నాయక్. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రూప్లా నాయక్, ఉపాధ్యక్షులుగా బంచిలాల్ నాయక్, తదితరులు ఎంపికయ్యారు.

వైభవంగా పవిత్రోత్సవాలు..

దిల్‌షుఖ్‌నగర్ సాయిబాబా దేవాలయంలో శుక్రవారం సాయిబాబాకు పవిత్ర నదీ జలాలతో పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ గుండ మల్లయ్య దంపతులు, మాజీ చైర్మన్ ఊర నర్సింహ గుప్తా దంపతులు, కోశాధికారి శంకర్‌రావు దంపతులు, పలువురు ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. – ఎల్బీనగర్, మార్చి 1

వందశాతం పన్ను వసూలు చేయాలి

వందంశాతం ఇంటిపన్ను వసూలు చేయాలని డీఎల్‌పీఓ సాధన తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పన్ను వసూళ్లలో జాప్యం చేయవద్దని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధిహామీ పనులు సక్రమంగా నిర్వహించాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరిత, ఎంపీఓ సునీల్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. – కందుకూరు, మార్చి 1

సంతోష్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని యాకుత్‌పుర ఎమ్మెల్యే మెరాజ్ హుసేన్ తెలిపారు. శుక్రవారం కార్పొరేటర్ ముజఫర్ హుసేన్‌తో కలిసి సంతోష్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటి సమస్యలు ఉన్నాయని.. అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. – మాదన్నపేట, మార్చి 1

కాంగ్రెస్‌లో చేరిన దేవిరెడ్డి శ్వేతారెడ్డి

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజారంజక పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్, పీసీసీ ప్రచార కమిటీ కో-కన్వీనర్ వజీర్ ప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలో పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ కొత్తపేట డివిజన్ మహిళా అధ్యక్షురాలు దేవిరెడ్డి శ్వేతారెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరి, హర్షిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు. – ఎల్బీనగర్, మార్చి 1

అమ్మవారి విశిష్టత గురించి వివరిస్తున్న ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆర్కేపురం, మార్చి 1: ఆర్కేపురం డివిజన్‌లోని కుర్తాళం పీఠం ఆదిపరాశక్తి ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ప్రత్యంగిరా హోమాలు, విశేష అభిషేకాలు, కుంకుమార్చన, నక్షత్ర హారతులు, విశేష అలంకరణ, భక్తి సంగీతం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నేడు చివరి రోజు సందర్భంగా అమ్మవారికి అన్నాభిషేకం, సాయంత్రం పల్లకీసేవా జరుగుతుందని ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చాణిక్యశర్మ, విట్టల్ శర్మ, సాయికుమార్‌శర్మ, మునిపల్లె సువర్ణలత, అరుణ, హేమ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ నర్సింహారెడ్డికి సమస్యలను వివరిస్తున్న సూర్యోదయనగర్ కాలనీవాసులు

దశలవారీగా అభివృద్ధి పనులు

మన్సూరాబాద్, మార్చి 1: మన్సూరాబాద్ డివిజన్ సూర్యోదనగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గసభ్యులు శుక్రవారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె.నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు కొంగరి నర్సింహారావు, ఎన్. మధుసూదన్‌రెడ్డి, రాంగోపాల్, ఎం.ప్రేమ్‌చందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి ఎస్.రాజయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులు డి.రామధర్మారెడ్డి, బి.కృష్ణారెడ్డి తదదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారిపై దాడి

సైదాబాద్, మార్చి 1: వడ్డీ వ్యాపారితో పాటు భార్యపై భర్త దాడి చేసిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సైదాబాద్ బస్తీకి చెందిన హనుమంతు, మౌనిక దంపతులు టైలరింగ్ షాపును నిర్వహిస్తున్నారు. అయితే అవసరాల నిమిత్తం వడ్డీ వ్యాపారి జగదీశ్ వద్ద రూ.40వేలు మౌనిక అప్పుగా తీసుకున్నది. అప్పు తీసుకున్న సమయంలో మౌనిక స్నేహితుడు ప్రసాద్ మధ్యవర్తిగా ఉన్నాడు. అయితే తీసుకున్న అప్పు చెల్లించాలని మౌనిక వద్దకు ప్రసాద్, జగదీశ్ వచ్చారు. తన భార్యతో మాట్లాడుతున్న విషయం తెలుసుకున్న భర్త హనుమంతు మద్యం సేవించి వచ్చి గొడవకు దిగాడు. ఘర్షన తీవ్రతరం కావడంతో తనతోపాటు తీసుకొచ్చిన కత్తెరతో హనుమంతు తన భర్యపై మధ్యవర్తి ప్రసాద్‌పై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ మౌనిక, ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. వడ్డీ వ్యాపారి జగదీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు.

నాణ్యత పాటించాలి

మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, మార్చి 1 : మూసీ నదిపై మూసారాంబాగ్ వద్ద నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిపై మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు అధికారులతో చర్చించారు. శుక్రవారం పాతబస్తీ ఫంజేషాలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంలో ఎత్తును తగ్గించడానికి తీసుకుంటున్న చర్యలను జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని చెప్పారు. అదే విధంగా సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్‌లో ఎంఐఎం పార్టీ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయాలి

■ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, మార్చి 1: ఫ్లైఓవర్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎన్‌డీపీ నిర్మాణ పనుల్లో భాగంగా బైరమాల్‌గూడలో నిర్మిస్తున్న స్కై ఫ్లైఓవర్ పనులు ముగిశాయని.. అదే విధంగా ఎల్బీనగర్ నుంచి చంపాపేటకు వెళ్లేందుకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని.. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫ్లై ఓవర్ పనులు త్వరగా పూర్తి చేసి అదుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రవీందర్ రెడ్డి, ఈఈ రోహిణి, డీఈ కార్తీక్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ధరణి స్పెషల్ డ్రైవ్ పొడిగించాలి

కందుకూరు, మార్చి 1: రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి నిర్వహిస్తున్న ధరణి స్పెషల్ డ్రైవ్ గడువును పొడిగించాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి కోరారు. హడావిడిగా నిర్వహిస్తే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో నాలుగు వేలకు పైగా పెండింగ్ ఫైల్స్ ఉనాయని.. కేవలం తొమ్మిది రోజుల్లో ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వం విధించిన గడువు సరిపొదని.. పొడిగించాలని కోరారు.

ఆర్టికల్ 370 రద్దు దేశ చరిత్రలో కీలక ఘట్టం

ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులను అద్దం పట్టేలా తీసిన ఆర్టికల్ 370 మూవీ టికెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి స్కూల్స్ అధినేత మల్క కొమరయ్య ఆధ్వర్యంలో కొత్తపేటలోని మహాలక్ష్మి, శాలిని శివానీ థియేటర్‌లో సుమారు 400 టికెట్లను ఉచితంగా పంపిణీ చేసి సినిమాలోని అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఇచ్చిన మాటకు కట్టుబడి 370 ఆర్టికల్ రద్దు చేశారని పేర్కొన్నారు. – ఆర్కేపురం, మార్చి 1

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

బడంగ్‌పేట, మార్చి 1: పాఠశాలల్లో వసతులు కల్పించాలని డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ తెలిపారు. శుక్రవారం బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఆచార్య రమేశ్ గురుజీ ఆధ్వర్యంలో సంస్కార వికాస సాధన, యోగా విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులకు, గురువులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ.. తల్లి దండ్రులను గురువులను ప్రతి విద్యార్థి గౌరవించాలని తెలిపారు. సంస్కార వికాస సాధన చేయడం, యోగా విజ్ఞానం పొందడం మంచిదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన సక్రమంగా లేనప్పుడు విద్యార్థులకు సంస్కార వికాసం ఎలా వస్తుందని.. వెయ్యి మంది విద్యార్థులు ఉంటే కనీసం టాయిలెట్స్ కూడా లేవన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేయూత ఇవ్వాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు ప్రసన్న కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టరు భూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న స్కూల్ కరస్పాండెంట్ కొండల్‌రెడ్డి

ర్యాంకుల కోసం ఒత్తిడి పెట్టొద్దు

■ అదనపు కలెక్టరు భూపాల్‌రెడ్డి

కందుకూరు, మార్చి 1: ర్యాంకుల కోసం విద్యార్థులపై ఒత్తిడి పెట్టొద్దని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం నోబుల్ హైస్కూల్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని సూచించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని.. క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. బట్టీ పట్టి చదివే చదువులకు స్వస్తి పలకాలని.. సమయ పాలన పాటిస్తూ చదవాలని కోరారు. అనంతరం ఇద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నోబుల్ హై స్కూల్ కరస్పాండెంట్ బైరు కొండల్‌రెడ్డి, న్యాయవాది బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ బైరు జగన్మోహన్‌రెడ్డి, మండల విద్యాధికారి మనోహర్, హై కోర్టు న్యాయవాది వెంకటాచారి, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE COURT NALGONDA AT KODAD
O.S.No. 164 OF 2020
BETWEEN:
Kondapally Sushma W/o. Srinath Yarasani ....Plaintiff
AND
1. KanmathReddy Ranga Reddy, S/o. Late K.Narayana Reddy & others ...Defendants
To
Defendant No 4.
Kanmathreddy Upender Reddy, S/o. Kanmathreddy Ranga Reddy, Aged 49 yrs, Occ: Pvt Service, R/o.H.NO:4-11-52/M.V.II/30, Maithri Vilas, Phase II, Bhagya Lathya, Kulvancha, Hayath Nagar, Ranga Reddy District - 70.
The said suit i.e., O.S.No. 164 of 2020 is adjourned to 05.03.2024. You are request to be present on 05.03.2024 at 10.30 A.M before Principal Junior Civil Judge Court at Kodad either in person or through an advocate else case will be heard in your absence.
Sd/- B. RAVI CHANDRA, Advocate
ravichandraadvocate@gmail.com
PH: 9703072729